ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 సిద్దిపేట

సోమవారం 11 మార్చి 2024

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు



● మొదటి విడతలో స్థలం ఉన్న నిరుపేదలకు ప్రాధాన్యం

● ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల కేటాయింపు

● జిల్లాలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు 2.36 లక్షల దరఖాస్తులు

● నేడు రాష్ట్రస్థాయిలో పథకం ప్రారంభం

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 10: ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో మరో గ్యారెంటీ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. సొంత స్థలం ఉన్న పేదలకు అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు రూ. 5 లక్షలు అందజేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేయనున్నది. ఈనెల 11న సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ఇటీవల చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇక, ఈసారైనా తమ సొంతింటి కల నెరవేరబోతుందని నిరుపేదలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ పథకం కింద తొలివిడతగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించనున్నారు.



లబ్ధిదారులకు అందని డబుల్ బెడ్‌రూంలు


2014 స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం స్థానంలో 2015లో డబుల్ బెడ్‌రూం పథకాన్ని తీసుకొచ్చింది. ఒక్కో ఇంటికి రూ.5.40 లక్షలు ఖర్చుపెట్టి ప్రభుత్వ స్థలంలోనే నిర్మించారు. జిల్లాలో 15,925 ఇండ్లను మంజూరు చేసింది. అందులో కేవలం 11,743 ఇండ్లను మాత్రమే లబ్ధిదారులకు అందించారు. మిగతా ఇళ్లు అలాగే ఉన్నాయి. మిగిలిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3 లక్షల వరకు సహాయం చేస్తామని గృహలక్ష్మి పథకం తీసుకువచ్చారు. జిల్లాకు మొదటి విడతలో 16,800 ఇండ్లు మంజూరయ్యాయి. 12,811 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ సైతం అందించారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

ఇందిరమ్మ ఇళ్లకు 2.36 లక్షల దరఖాస్తు...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో మాదిరిగానే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. పథకానికి సంబంధించి ప్రజాపాలనలో దరఖాస్తులు సైతం స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లకు ప్రజాపాలనలో 2,36,014 దరఖాస్తులు వచ్చాయి. పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మొదట సొంత స్థలం ఉన్న పేదలకే వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఇందిరమ్మ ఇంటి కోసం వచ్చిన దరఖాస్తుల్లో అర్హులు ఎంత మంది ఉన్నారనేది గుర్తించనున్నారు. మార్గదర్శకాలు విడుదలైన తరువాత మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా క్షేత్రస్థాయిల్లో సభలు నిర్వహించనున్నారు.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు..

జిల్లాలో మొదటివిడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించనున్నారు. జిల్లాలో సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, మానకొండూర్, జనగాం నియోజకవర్గాలున్నాయి. అయితే కేవలం సిద్దిపేట నియోజకవర్గంలోనే అన్ని మండలాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. మిగతా నియోజకవర్గ మండలాలు కొన్ని ఇతర జిల్లాలో ఉన్నాయి. అయితే మండలాల వారీగా ఇళ్లకు కేటాయించి జిల్లాకు ఎన్ని మంజూరవుతాయో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదే విషయంపై డబుల్ బెడ్‌రూం నోడల్ అధికారి శ్యాంసుందర్‌ను వివరణ అడగగా.. దీనిపై ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఎలాంటి సమాచారమూ రాలేదని ఆయన తెలిపారు.



అంగరంగ వైభవంగా..

● ఏడుపాయలలో వనదుర్గామాత రథోత్సవం

● రథాన్ని లాగడానికి పోటీపడిన భక్తులు

● పెద్దపట్నం వేసి.. అన్నాన్ని రాశిగా పోసి పూజలు


ఏడుపాయలలో రథం లాగుతున్న భక్తులు

పాపన్నపేట, మార్చి 10: ఏడుపాయల జాతరలో చివరి అంకమైన రథోత్సవం ఆదివారం రాత్రి ఉత్సాహంగా సాగింది. ఏడుపాయల ధర్మకర్త రాగి చక్రపాణి తయారు చేయించిన కొత్త రథాన్ని రంగుల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆనవాయితీ ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన సాయిరెడ్డి ఇంటికి వెళ్లి రథోత్సవానికి ఆహ్వానం పలికారు. నాగ్సాన్‌పల్లికి చెందిన 18 రకాల వృత్తుల వారు ఏడుపాయలకు వచ్చి, రథం ఎదుట పెద్దపట్నం వేసి అన్నాన్ని రాశిగాపోసి గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు గర్భగుడిలో నుంచి వనదుర్గమ్మ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం పల్లకీలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు వనదుర్గామాత నామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాయల అటవీ ప్రాంతం ప్రతిధ్వనించింది.

పోటెత్తిన భక్తజనం

జాతర రథోత్సవం, ఆదివారం కలిసిరావడంతో ఏడుపాయల క్షేత్రం కిటకిటలాడింది. లక్షకు పైగా భక్తులు అమ్మవారి దర్శనానికి గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో వేచిఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. రోజంతా అమ్మవారికి మొక్కులు చెల్లించే భక్తుల బోనాల ఊరేగింపులు, శివసత్తుల పూనకాలు, ఒడిబియ్యం, తలనీలాల సమర్పణతో సందడిగా సాగింది. వందల పొట్టేళ్లను, కోళ్లను సమర్పించి విందులు చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఏ చోట చూసినా గుడారాలు వేసుకుని భక్తులు సేదతీరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేష్ ఆధ్వర్యంలో 700 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, ధర్మకర్తలు రథోత్సవ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. జాతరలో పరిశుభ్రతకు పెద్దపీట వేశారు. బండ్ల ఊరేగింపు రోజు వేర్వేరు కారణాలతో అస్వస్థతకు లోనైన పలువురిని ప్రథమ చికిత్స అందించిన వైద్య సిబ్బంది 108 వాహనంలో చికిత్స కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తక్షణమే సాగునీరందించాలి

● రాజకీయాలు కాకుండా రైతు ప్రయోజనాలపై దృష్టి సారించాలి

● రంగనాయక సాగర్‌లోకి వెంటనే 1 టీఎంసీ నీటిని ఎత్తిపోయాలి

● నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్, మార్చి10: సిద్దిపేట జిల్లా రైతాంగానికి తక్షణ మే సాగునీరందించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. ఆరుగాలం శ్రమించి వరి పంట సాగుచేస్తున్న అన్నదాతల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో సాగుచేస్తున్న యాసంగి పంటలు చేతికి రావాలంటే వెంటనే సాగు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లలో ముందస్తు ప్రణాళిక ప్రకారం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా సాగునీటిని అందుబాటులో ఉంచామని గుర్తుచేశారు. అయితే, నేడు మీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అలసత్వం వహిస్తున్నట్లుగా అర్థమవుతుందన్నారు. ఓ పక్క సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. కళ్లముందే ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. కొత్త బోర్లు వేయిస్తూ అప్పుల పాలవుతున్నారని, వ్యవసాయ బావులకు సంబంధించి పూడికతీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని ఆయన వివరించారు. ఈ దుస్థితిని అధిగమించాలంటే వెంటనే రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి 1 టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని, నాలుగేళ్లపాటు ఈ సమయంలో రంగనాయకసాగర్ నిండుకుండలా నీటితో కళకళలాడింది. కానీ ప్రస్తుతం నీళ్లు లేక రిజర్వాయర్ బోసిపోయి కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి కూడా తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్‌లో కూడా 1 టీఎంసీ నీటిని నిల్వ ఉంచాలని లేఖలో కోరారు. క్షేత్ర స్థాయిలో మీరు పరిశీలించి వాస్తవాలను గ్రహించాల్సిందిగా కోరుతున్నానని చెప్పారు. రాజకీయాలు కాకుండా రైతుల ప్రయోజనాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు తగిన పరిష్కారం చూపించకుంటే త్వరలోనే రైతుల పక్షాన పోరాటాలకు సైతం సిద్ధమవుతామని స్పష్టం చేశారు. రైతులకు అండగా ఉంటానని వెల్లడించారు.


మల్లన్నఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

కొమురెల్లి క్షేత్రం.. భక్తిపారవశ్యం

7 లో..

● ఎనిమిదోవారం మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం ● దర్శనానికి మూడు గంటలు

ఉల్లాసంగా.. హాఫ్ మారథాన్

● పాల్గొన్న 1200 మంది యువతీయువకులు

● హాజరైన రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

● సపోర్ట్ రన్నర్స్ సహకారంతో 21కె పూర్తి చేసిన అంధుడు


విజేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 10 : హుస్నాబాద్ పట్టణం ఆదివారం సందడిగా మారింది. హుస్నాబాద్ రన్నింగ్ అసోసియేషన్, పోలీస్‌శాఖ సంయుక్తగా నిర్వహించిన హాఫ్ మారథాన్ (21 కిలోమీటర్ల రన్) ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. హాఫ్‌మారథాన్‌తో పాటు 10కె, 5కె రన్ నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 1200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీనారాయణ అనే అంధుడు సపోర్ట్ రన్నర్స్ సహకారంతో 21 కిలోమీటర్ల పరుగు పూర్తిచేసి అందరినీ అబ్బురపర్చాడు. లక్ష్మీనారాయణను మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఢిల్లీలో జరిగిన మారథాన్‌లో పాల్గొన్నానని లక్ష్మీనారాయణ వివరించారు. అలాగే 70 ఏళ్ల వృద్ధులు కూడా ఇందులో పాల్గొని తాము తక్కువ కాదని నిరూపించారు. పోటీల్లో గెలుపొందిన యువతీయువకులకు మెడల్స్, నగదు బహుమతులను మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. హుస్నాబాద్‌లో నాలుగోసారి నిర్వహించిన ఈ హాఫ్ మారథాన్‌కు విశేష స్పందన లభించింది.


రన్నింగ్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అభినందనీయం : మంత్రి పొన్నం ప్రభాకర్

మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే నిర్వహించే హాఫ్ మారథాన్‌ను హుస్నాబాద్‌లో నాలుగోసారి నిర్వహించడం అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, అందుకు తానే అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ఇక ముందు 5వ తరగతి పైన చదువుకునే ప్రతి ఒక్కరూ పాల్గొనే విధంగా కార్యక్రమం చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఓడిన వారు మరింత స్ఫూర్తితో విజయం సాధించే వరకు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీఐలు శ్రీనివాస్, రఘు, ఎస్ఐ తోట మహేశ్, రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల వెంకట్, రమేశ్, చింతకింది శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య, సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, ప్రముఖ గాయకులు నేర్నాల కిషోర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, అక్కు శ్రీనివాస్, వివి రమణ, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, వాల సుప్రజ, రమాదేవి, గోవిందు రవి పాల్గొన్నారు.


హాఫ్‌మారథాన్‌లో పాల్గొన్న అంధుడు

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి

హుస్నాబాద్‌లోని సీవీ రామన్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హుస్నాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్లు, వైకుంఠరథాల ఏర్పాటుకు కలెక్టర్‌తో మాట్లాడుతానని ఈ సందర్భంగా అన్నారు. తన తండ్రి పేరున ఓ వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహణ చేస్తానంటే అంబులెన్స్‌ను కొనిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు చిట్టి గోపాల్‌రెడ్డి, కాయిత నారాయణరెడ్డి, రాజ గోపాల్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జగ్గారెడ్డి తదితరులున్నారు.

యువత పెడదారి పట్టకుండా క్రీడలు దోహదం

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువత పెడదారి పట్టకుండా క్రీడలు దోహదపడతాయని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో క్రిష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో తనకు కబడ్డీ అంటే ఎంతో ఇష్టమని తన చిన్నతనంలో ఒక కబడ్డీ మాత్రమే ఆడేవాడినని గుర్తుచేశారు. మంత్రి వెంట టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్థానిక ఎంపీటీసీ శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ సాయన్న ప్రముఖ జానపద కళాకారుడు నేర్నాల కిషోర్, వివిధ జిల్లాల నుండి వచ్చిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.


పోతారం(ఎస్)లో కబడ్డీ ఆడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నాటుకు నీరందేనా?

● రికార్డు స్థాయిలో వరినాట్లు ● అడుగంటుతున్న భూగర్భజలాలు

● చివరి వరకు నీరందడం కష్టమే!

మెదక్, మార్చి 10: వేసవి ముంచుకొస్తున్నది.. మార్చి మొదటివారంనుంచే ఎండలు దంచుతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. బోర్లు సరిపడా నీరు పోయడం లేదు. ఈ యాసంగి పంటలను కాపాడుకోవడం అన్నదాతకు తలకుమించిన భారమే అయ్యేలా కనిపిస్తున్నది.

ఆలస్యంగా నాట్లు

ఈ యాసంగిలో రైతులు ఆలస్యంగా వరినాట్లు వేశారు. సాధారణంగా అక్టోబరు నెలలో నారుమళ్లు పోసుకుని.. డిసెంబరు నెలాఖరుకు నాట్లు పూర్తిచేస్తారు. కానీ ఈసారి ఎన్నికల సందడి కారణంగా వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఘనపురం ప్రాజెక్ట్ ఆయకట్టు ప్రాంతమైన కొల్చారం, మెదక్, హవేళీఘనాపూర్, పాపన్నపేట మండలాల్లో సుమరు 25 వేల ఎకరాల్లో వరి పొలాలకు కాల్వల ద్వారా పంటలకు నీరందిస్తున్నారు. మిగతా మండలాల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

పడిపోతున్న జలమట్టాలు

ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండడంతో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. వానాకాలం సీజన్ మాదిరిగానే జిల్లాలో వరిసాగు పెరిగిపోవడం, దానికి తోడు బోరు బావుల నుంచి పంటపొలాలకు సరిపడా నీరందడం లేదు. వరికి నీరందించడం కారణంగా గత రెండు నెలల వ్యవధిలోనే బోరు బావుల్లో నీటిమట్టాలు తగ్గిపోయినట్లు జియాలజిస్టులు చెబుతున్నారు. జిల్లాలో 60 వేల వ్యవసాయ బోర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా మరో 30 వేలు ఉంటాయని అంచనా. జనవరి మాసంలో జిల్లా సగటు జలమట్టాలు 11 మీటర్లు కాగా ఫిబ్రవరిలో 13 మీటర్ల లోతుకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎండలు రోజురోజుకూ తీవ్రమవుతుండడంతో జలమట్టాలు మరింతగా తగ్గిపోయే సూచనలున్నాయని భూగర్భ జలశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం హవేళీఘనాపూర్, మెదక్, చిన్న శంకరంపేట, అల్లాదుర్గం, పెద్ద శంకరం పేట, రేగోడ్, రామాయంపేట, నార్సింగి మండలాల్లో పంటలకు నీరందడం లేదు. రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.


నార్సింగి మండలం నర్సంపల్లిలో నెర్రెలు వారుతున్న వరి పొలం

పదో తరగతి పిల్లలకు స్నాక్స్ లేవ్!

- గత నెల డబ్బులిస్తామన్న అధికారులు
- తర్వాత అర్ధాంతరంగా నిర్ణయం వెనక్కి
- దాతలు ముందుకు రాక అర్ధాకలి చదువులు


సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 10 : పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే స్పెషల్‌క్లాసుల్లో స్నాక్స్ ఇచ్చేందుకు ప్రతి ఏటా నిధుల కోసం అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొన్నది. దాతల సహకారంతో స్నాక్స్ ఇవ్వాలంటూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇలా ఉండగా గత నెల 7 వ తేదీన 'అర్ధాకలి చదువులు- దాతల కోసం ఎదురుచూపులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సంగారెడ్డి జిల్లాలో కథనం ప్రచురితమైంది. ఆ సమయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పందించారు. పదో తరగతి విద్యార్థుల స్నాక్స్ నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున 28 రోజులకుగాను రూ.28,68,000 నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు జిల్లా విద్యాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం ప్రారంభించాలని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో ఆదేశాలు జారీ చేశారు. తర్వాత ఏమైందో ఏమో కానీ ఆ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు.

అధికారుల తీరుపై విస్మయం

విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పాఠశాలకు వచ్చి సాయంత్రం 5.45 గంటలకు వెళుతున్నారు. జిల్లాలోని 239 ఉన్నత పాఠశాలల్లో 11,008 మంది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్పెషల్‌క్లాసులకు హాజరవుతున్నారు. స్నాక్స్ కోసం జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో సీఎస్ఆర్ నిధులు ఇస్తామని జిల్లా యంత్రాంగం హామీ ఇవ్వగా, తర్వాత ఎవరూ ముందుకు రాలేరని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. దీంతో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం నిలిచిపోయింది. ఈ విషయం కొన్ని ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియడంతో వారు స్నాక్స్ ఇవ్వడం ఆపేశారు. మరికొన్ని పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి సమాచారం అధికారికంగా వెళ్లకపోవడంతో స్నాక్స్ కంటిన్యూగా ఇస్తున్నారు. కొన్నిచోట్ల సొంతంగా డబ్బు వెచ్చించి స్నాక్స్ ఇస్తుండడం గమనార్హం. సమాచారం అందని చాలా మంది ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నిరోజులు పిల్లలకు స్నాక్స్ ఇచ్చిన డబ్బు ఎవరిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. మరో వారం రోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నిధుల విషయంలో వెనక్కి తగ్గడం పట్ల ఇటు జిల్లా యంత్రాంగం, అటు జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది.

కరాటే, కుంగ్‌ఫూ విజేతలకు బహుమతుల ప్రదానం


ట్రోఫీని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మైనంపల్లి

మనోహరాబాద్, మార్చి 10 : మండల కేంద్రంలో నిర్వహించిన కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు బహుమతులను ప్రదానం చేశారు. మనోహరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాస్టర్‌లు సాయి, సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బ్లాక్‌బెల్ట్‌లను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో పోలీసు బలగాల కవాతు

తూప్రాన్, మార్చి 10: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు ఎస్పీ డాక్టర్ బాలస్వామి ఆదేశాల మేరకు తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్ పట్టణంలో వివిధ దళాలకు చెందిన పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ (కవాతు) నిర్వహించారు. తూప్రాన్ పోలీస్‌స్టేషన్ నుంచి పాత హైవే మీదుగా నర్సాపూర్ చౌరస్తా వరకు కవాతు చేపట్టారు. ఇందులో తూప్రాన్ ఎస్ఐ శివానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత కొలువుదీరనున్న పాలకవర్గం

● జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు పూర్తి

జహీరాబాద్, మార్చి 10 : జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక ఐదేళ్లు కావస్తుంది. 2019 నుంచి ఇప్పటివరకు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గమంటూ లేకుండాపోయింది. బీఆర్ఎస్ హయాంలో పాలకవర్గంలో ఏర్పాటు విషయంలో వివిధ కారణాలతో జాప్యం చేశారు. ఐదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాలకవర్గం ఏర్పాటుకు సోమవారం ముహూర్తం ఖరారు చేశారు. చైర్మన్‌గా ఆగమ సాయిచరణ్‌ను, ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డిని ఎంపిక చేశారు. వీరితో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కొమురెల్లి క్షేత్రం.. భక్తిపారవశ్యం

● ఎనిమిదోవారం హోరెత్తిన మల్లన్న నామస్మరణ.. దర్శనానికి మూడు గంటలు

కొమురవెల్లి, మార్చి 10 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎనిమిదోవారం జాతరకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. భక్తులు తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో స్నానమాచరించారు. మల్లన్నకు బోనం నివేదించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చమని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. అనంతరం మల్లన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఎల్లమ్మతల్లికి బెల్లం పానకం, కల్లుసాక పోసి, బోనం నివేదించారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఆలయ ఈవో బాలాజీ శర్మ, ఆలయ సూపరింటెండెంట్లు నీల శేఖర్, బుద్ధి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మల్లన్నను జిల్లా అడిషనల్ డీసీపీ (లా ఆర్డర్) మల్లారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయ ముఖమండపంలో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కమనీయం

కేతకీలో అంగరంగవైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కేతకీ సంగమేశ్వరాలయంలో నిర్వహిస్తున్న పార్వతీపరమేశ్వర్ల కల్యాణం, మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు



ఝరాసంగం, మార్చి 10 : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదామంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమాన్ని తిలకిచేందుకు కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి కట్నకానుకలను సమర్పించుకున్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం ఆలయంలోని స్వామివారికి అభిషేక కార్యక్రమాలతో పాటుగా ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రుడి వేషాధారణలో దండకాల మధ్య బసవన్న మందిరం వరకు పల్లకీసేవను నిర్వహించారు. ఇక్కడ చేపట్టిన అగ్నిగుండప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శశిధర్, నేతలు హనుమంతురావు పాటిల్, ఉమాకాంత్‌పాటిల్, ఉదయ్‌శంకర్‌పాటిల్, వెంకటేషం, మాజీ ఆలయ చైర్మన్ వెంకటేషంగుప్తా, ఆలయ సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయంలో అమావాస్య పూజలు

కేతకీ సంగమేశ్వరాలయంలో అమావాస్య పూజలను నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండడంతో మూడు రోజుల నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడుతున్నది. ఆదివారం భక్తులు ఉదయం అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ ఆవరణలోని నవగ్రహాలకు తైలం, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని మండపంలో అభిషేక కార్యక్రమాలను చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది, ఆలయాధికారులు ప్రత్యేక చర్యలను చేపట్టారు. జహీరాబాద్ నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. మండల పరిధిలోని మాచునూర్ శివారులోని రామేశ్వర ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు పూజలు చేశారు. కుప్పానగర్, చీలపల్లి గ్రామ శివారులోని మల్లయ్యగిరి గుట్టపై వెలిసిన మల్లికార్జునస్వామికి భక్తులు మొక్కులు చెల్లించారు.





స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, పల్లకీసేవలో దండకం వేస్తున్న బాలిక

ఘనంగా భద్రప్పస్వామి జాతర



ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎడ్లబండ్లు

కల్హేర్, మార్చి 10 : కల్హేర్‌లోని భద్రప్పస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. భద్రప్పస్వామి, శివాలయం, ఆంజనేయ, పోలేరమ్మ ఆలయాల చుట్టూ భక్తులు ఎడ్లబండ్లను తిప్పి మొక్కులను చెల్లించుకున్నారు.

వైభవంగా మహాదేవుని గుట్ట జాతర

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 10 : సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి గ్రామ శివారులోని మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న మహాదేవుని గుట్ట జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొని రథం లాగారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రాంసింగ్, సిర్గాపూర్ ఎంపీపీ జారా మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రావ్ పాటిల్, గోసాయిపల్లి మాజీ సర్పంచ్ సాయాగౌడ్, నాయకులు సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

1008 సామూహిక నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించనున్న నాగదేవతా విగ్రహాలు



జహీరాబాద్, మార్చి 10 : జహీరాబాద్ పట్టణంలోని కైలాసగిరి శివాలయం వద్ద సోమవారం 1008 నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉమ్మడి మెదక్‌జిల్లాలోనే ఎక్కడ ఇలాంటి ఆలయం లేదని వారు పేర్కొన్నారు. నాగదేవత ఆలయంలో 11, 12, 13న విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వెంకటఖ్వాజా దర్గాలో దీపకాంతులు

● రెండోరోజు వైభవంగా ఉర్సు ● గంధం సమర్పించిన ఎంపీ బీబీ పాటిల్

వట్‌పల్లి, మార్చి 10 : వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా 39వ ఉర్సు ఉత్సవాలు రెండోరోజు వైభవంగా కొనసాగాయి. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులను చెల్లించుకున్నారు. దర్గా ఆవరణంలో భక్తులు లక్షా 11 వేల దీపాలను వెలిగించారు. దీంతో దర్గా ప్రాంగణమంతా దీపాలతో మెరిసిపోయింది. దర్గా ఆరాధన ఉత్సవాలకు జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ హాజరై గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి ముకుందరావు చిస్తీ ప్రసాదం అందజేశారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ అనంతరావు కులకర్ణి, ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు సురేష్‌గౌడ్, నాయకులు వడ్ల నాగేష్, అనిల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో మహిళలు వెలిగిస్తున్న దీపాలు



విద్యుత్ దీపాల వెలుగులో దర్గా

పెద్దచెరువు మత్తడి రాళ్లను తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు



నీళ్లు దిగవకు వెళ్లకుండా ఇసుక సంచులతో మూసివేస్తున్న రైతులు

నారాయణరావుపేట, మార్చి 10 : సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రంలోని పెద్దచెరువు మత్తడి రాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ ద్వారా చెరువుల్లోకి నీళ్లు నింపుతుండగా ఈ క్రమంలోనే ప్రాజెక్ట్ నీటితో పెద్దచెరువు నిండింది. మత్తడి లేవల్‌కు రాకముందే శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చెరువు పెద్దమత్తడిపై సుమారు మూడు మీటర్ల పొడవు రెండు వరుసల మత్తడి కట్టురాళ్లను తొలగించారు. ఆదివారం ఉదయం గ్రామ రైతులతో పాటు చెరువు కింది పక్క గ్రామాల రైతులు పెద్ద చెరువు వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు, సిద్దిపేట రూరల్ పోలీసులు వచ్చి రైతులకు సర్దిచెప్పారు. రాళ్లు తొలగించిన ప్రదేశాన్ని ఇసక సంచులతో మూసివేసి నీటిని కట్టడి చేయించారు. ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా చట్టవిరుద్ధమైన పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏఈ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఈ విషయమై సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రామాయంపేటలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

● పాల్గొన్న 170 మంది క్రీడాకారులు



జెండా ఊపి సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

రామాయంపేట, మార్చి 10 : రామాయంపేటలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఛాంపియన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. దీనిలో 17 జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 16, 17 విభాగాల్లో బాల బాలికలు, అండర్ 19, 23 క్రీడాకారులు మౌంటెన్ బైక్ రేస్‌లో పాల్గొన్నారు. మెదక్ రూట్‌లోని బ్రిడ్జి వద్ద సైక్లింగ్ అసోసియేషన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. గుట్టల మీదుగా రెండు గంటల పాటు క్రీడాకారులు పోటీతత్వంతో సైకిల్ తొక్కారు. ప్రతిభ కనబరిచిన 76 మంది క్రీడాకారులకు సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు షీల్డ్‌లు, మెడల్‌లు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈనెల 28వ తేదీన హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. కాగా ముగింపుసభలో సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు విజయ్‌కాంత్, మనోహర్, రవికుమార్, జానకీరాంతో పాటు సైక్లింగ్ కోచ్ దండు యాదగిరి, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రం



ఏడుపాయల ఆలయ పరిసరాల్లో గుడారాలు



రథం ఎదుట పట్నం వేస్తున్న దృశ్యం



ఆలయం వద్ద భక్తజనం

మూడో రోజు ఏడుపాయల జనసంద్రమైంది. ఆదివారం రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.
- పాపన్నపేట



విశేష అలంకరణలో వనదుర్గామాత

సావిత్రిబాయి సేవలు మరువలేనివి

గజ్వేల్, మార్చి 10: సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమలో డీబీఎఫ్ నాయకులు భారతమ్మ, నర్సవ్వ, జ్యోష్న, పవిత్ర, రిత్విక్, దుర్గాప్రసాద్, బాల్‌లక్ష్మి తదితరులున్నారు. సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని గజ్వేల్ మండలం కొడకండ్ల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు చందా ప్రవీణ్‌కుమార్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా కొడకండ్ల గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితో మాజీ సర్పంచ్ ఎడ్ల భూమయ్య, ప్రధాన కార్యదర్శి బందేల కరుణాకర్, మాజీ అధ్యక్షుడు గిరిబాబు, దొడ్డి ముఖేష్, సంఘం సభ్యులు కుక్కల ప్రవీణ్, బాల్‌చంద్రం, మిందే ప్రవీణ్, భాను, కుక్కల సుధాకర్, తలారి ప్రశాంత్ తదితరులున్నారు.

● **చిన్నకోడూరు:** స్త్రీ జాతి విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నతురాలు సావిత్రిబాయి పూలే అని వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా చిన్నకోడూరులో ఆమె విగ్రహానికి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సావిత్రి బాయి పూలే వర్ధంతిన, జయంతిన సెలవు ప్రకటించాలని, విద్యా దినోత్సవంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శారద, బీఆర్ఎస్ నాయకుల శ్రీనివాస్, రమేష్, సుధాకర్, రఘు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె విగ్రహానికి 1986-87 ఎస్ఎస్‌సీ పూర్వవిద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సామాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మిత్రమండలి-87 అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్, పెరుమాండ్ల శ్రీనివాస్, మోహన, చిత్తారి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, మహేందర్ ఉన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఎనగందుల శంకర్, మండల అధ్యక్షుడు వేల్పుల రాజులు సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


గజ్వేల్ : అనంతరావుపల్లిలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

● **హుస్నాబాద్‌రూరల్:** సావిత్రిబాయి పూలే వర్ధంతిని మిత్రమండలి 87 ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిలేని అనిత పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మిత్రమండలి 87 బృందం అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్, చిత్తారి శ్రీనివాస్, కానుగుల మోహన్, రాజేంద్రప్రసాద్, పెరుమాండ్ల శ్రీనివాస్, రమణారెడ్డి ఉన్నారు.


గజ్వేల్ : కొడకండ్లలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు


చిన్నకోడూరులో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


హుస్నాబాద్: సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న 1986-87 ఎస్ఎస్‌సీ విద్యార్థులు

సైకిల్ పైనుంచి పడి వ్యక్తి మృతి


మృతిచెందినస్వామి

అక్బర్‌పేట- భూంపల్లి, మార్చి10: ఓ వ్యక్తి సైకిల్ మీద నుంచి కింద పడి మృతిచెందాడు. ఈ సంఘటన ఎనగుర్తి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన డాకుల స్వామి(54) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం గ్రామంలోని హోటల్ వద్ద టీ తాగేందుకు వెళ్లిన డాకుల స్వామి సైకిల్ మీద నుంచి దిగుతుండగా జారి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

వర్గల్, మార్చి 10 : తల్లి మందలించిందని మనస్తాపం చెందిన బోడపట్ల నవనీత (20) అనే వివాహిత ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటన సామలపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. బేగంపేట ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం సామలపల్లి గ్రామానికి చెందిన చిగుళ్ల నర్సింలు, జయమ్మ దంపతుల కుమార్తె నవనీతను సంవత్సరంన్నర క్రితం మర్పడగ గ్రామానికి చెందిన బోడపట్ల యాదగిరితో వివాహం జరిపించారు. వివాహం అయిన నాటి నుంచి ఆమె తరచూ పుట్టింటికి వస్తుండటంతో పలుమార్లు నచ్చజెప్పి అత్తారింటికి పంపేవారు. శనివారం కూడా పుట్టింటికి వచ్చిన నవనీతను తల్లి జయమ్మ మందలించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నవనీత దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాయపోల్, మార్చి 10: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని కృష్ణసాగర్‌లో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పుల సుశీల(55) కిడ్నీలు దెబ్బతిని కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఇటీవలనే జారి పడడంతో కాలు కూడా విరిగింది. దీంతో ఆమె తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఆమెను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతిచెందింది. మృతురాలి కుమారుడు కొప్పుల అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

మర్కుక్, మార్చి 10: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం అయిన సంఘటన మండలంలోని పాములపర్తి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాకలి బుచ్చమ్మ దుస్తులను ఇస్త్రీ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నది. విద్యుదాఘాతంతో ఇస్త్రీ చేయడానికి ఇచ్చిన పట్టుచీరలు, దుస్తులు, వస్తువులతో పాటు ఇల్లు పూర్తిగా కాలిబూడిదైయింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు

మద్దూరు, మార్చి 10: పేకాటాడుతున్న ఏడుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపారు. మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన ఏడుగురు రేబర్తి-లక్కపల్లి గ్రామాల మధ్యన ఉన్న కొట్టంలో పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి వెళ్లి పట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.5,850ల నగదు, 7 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

● కొండపాక వైస్ ఎంపీపీ దేవీ రవీందర్


మాట్లాడుతున్న దేవీ రవీందర్

కుకునూరుపల్లి, మార్చి 10: మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగినప్పుడే సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందని కొండపాక వైస్ ఎంపీపీ దేవీ రవీందర్ తెలిపారు. మండలంలోని లకుడారం గ్రామంలో నాబార్డ్ సహకారంతో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై 20 రోజుల శిక్షణ శిబిరాన్ని సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సొంతంగా వీటిని ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. సెర్ప్ ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణ అనంతరం సొంతంగా వ్యాపారం ప్రారంభించుటకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ రాజలింగం, సీసీ యాకూబ్, కందూరి కనకవ్వ, ఐలయ్య, సంస్థ కో ఆర్డినేటర్ ప్రవీణ్, వీఏఓలు కవిత, రేణుక, బాలలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించాలి

రాయపోల్, మార్చి 10: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి వివరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాయపోల్‌లో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడిగా పనిచేసిన వెంకట్‌గౌడ్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా ఎన్నికైన రాజాగౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న కానుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజాగౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీ సాధించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బీ. రవీందర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎం. స్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో కంపుకొడుతున్న రైతుబజార్

చేర్యాల, మార్చి 10 : చేర్యాల పట్టణంలోని రైతుబజారు ఆవరణ కుళ్లిన కూరగాయలతో కంపుకొడుతున్నది. గతంలో గ్రామపంచాయతీగా కొనసాగి న సమయంలో ఉన్న చిరుకూరగాయల వ్యాపారులను మార్కెటింగ్‌శాఖ పరిధిలోని రైతుబజారుకు వెళ్లి కూరగాయలు విక్రయించుకుంటున్నారు. కానీ రోజువారీగా కుళ్లిపోయిన కూరగాయల నిల్వతో పాటు ఎప్పటికప్పుడు తరలించి శుభ్రపరిచే విషయంలో మార్కెటింగ్, మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్నిరోజులుగా పాడైన కూరగాయలను మెట్లపైన పారబోస్తుండడంతో, కొద్దిరోజులక్రితం డ్రమ్మును ఏర్పాటు చేశారు. కానీ అది ఏమాత్రం సరిపడకపోవడంతో మెట్లపైనే పారబోస్తున్నారు. రైతుబజారు ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో, కూరగాయలు కొనుగోలు చేయాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఈ విషయమై మునిసిపల్, మార్కెటింగ్ అధికారులు చొరవ చూపించి కుళ్లిన వ్యర్థాల నిల్వ కోసం డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


నంగునూరు ఉన్నత పాఠశాలలో 1987-88లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువుల సమక్షంలో యోగ క్షేమాలు తెలుసుకొన్నారు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు.

- నంగునూరు

ఉమామహేశ్వర ఆలయంలో కల్యాణం

మర్కుక్, మార్చి 10: మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో ఉన్న ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహాశివరాత్రి నుంచి 5 రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మర్కుక్ మండల జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చెర్మన్ బల్లి శ్రీనివాస్‌గుప్త, తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీరాములగౌడ్, ఎంపీటీసీ గొలి నరేందర్, పీఆర్టీయూ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. బల్లి శ్రీనివాస్‌గుప్త, శ్రీధర్‌గుప్తల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్, దుద్దెడ నర్సింలు, రాములు, మహేందర్‌రెడ్డి, పాములపర్తి మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ కనకయ్యగౌడ్, నాయకులు ర్యాకం యాదగిరి, మీసాల శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యువసేన సభ్యులు మన్నె అంజనేయులు, సుదర్శన్‌గౌడ్, రాముగౌడ్, వెంకటేశ్‌చారి, శ్రీనివాస్, తిరుపతి, కుమ్మరి కనకయ్య, నాగరాజు, వెంకటేశ్ తదితరులున్నారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నిధులున్నా మొదలుకాని బైపాస్ మరమ్మతులు

● ఏడాదిన్నర క్రితం రూ.1.18కోట్లు మంజూరు

● టెండర్ పూర్తయినా పనుల ప్రారంభంలో నిర్లక్ష్యం

చేర్యాల, మార్చి 10 : పట్టణంలోని బాలాజీ కళామందిర్ చౌరస్తా నుంచి ఆకునూరు, మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామాలకు వెళ్లే బైపాస్‌రోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డునిర్వహణ పట్టించుకోకపోవడంతో బీటీ లేచిపోయి అడుగడుగునా గుంతలమయమై ప్రమాదకరంగా ఉంది. మరమ్మతుల కోసం ఏడాదిన్నర క్రితం రూ.1.18కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ పూర్తై కాంట్రాకర్‌ను ఖరారు చేసినా, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు మొదలు కాలేదు. తూర్పుగుంటూరుపల్లి సమీపంలో ఇటుకబట్టీ ఉండటంతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం కారణంగా నిత్యం వాహనాల రద్దీ కొనసాగుతున్నది. వర్షపడితే గుంతల్లో నీరు నిలిచి, బురదమయం కావడంతో పాటు రాత్రి సమయంలో గుంతలు కనిపించక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.


ప్రమాదకరంగా మారిన బైపాస్‌రోడ్డు

ప్రభుత్వ నిర్ణయంతో నీలినీడలు

ప్రభుత్వం మారడంతో జాప్యం కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించని పనులను నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో టెండర్ పూర్తయినప్పటికీ బైపాస్‌రోడ్డు పనులలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈవిషయమై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లీకేజీతో వృథాగా పోతున్న నీళ్లు

మద్దూరు, మార్చి 10 : మద్దూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీటి ట్యాంకు పక్కనే ఉన్న పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతున్నది. నెల రోజులుగా నీళ్లు పోతున్నా గ్రామపంచాయతీ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టడం లేదంటూ, కాలనీవాసులు వాపోతున్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులు

మద్దూరు, మార్చి 10 : మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉత్కం ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా సుందరగిరి బాలకిషన్, కమిటీ సభ్యులుగా సుందరగిరి సిద్దిరాజయ్య, ఉట్కూరు వెంకట్, బత్తిని కనకయ్య ఎన్నికైనట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

కుకునూరుపల్లి, మార్చి 10 : కుకునూరుపల్లి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎన్ఎస్‌యూఐ జిల్లా సెక్రటరీ కుంచెం రవి పాల్గొన్నారు.

మునిసిపల్ మాజీ చైర్మన్‌ను పరామర్శించిన 'మైనంపల్లి'

గజ్వేల్, మార్చి 10: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌కు ఇటీవల బైపాస్ సర్జరీ అయిన విషయం తెలుసుకున్న మైనంపల్లి హనుమంతరావు గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారివెంట మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, నాయిని యాదగిరి, మోహన్నగారి రాజు, నరేందర్‌రెడ్డి, మోహన్, శ్రీధర్, సుభాష్ చంద్రబోస్, నక్క రాములుగౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, అనూప్, మహిపాల్‌రెడ్డి, అజ్జర్, బాబా, రాజు, లక్ష్మీనారాయణ, శివులు, సురేశ్ తదితరులున్నారు. ప్రజ్ఞాపూర్‌లోని శ్రీ పార్థివేశ్వరాలయాన్ని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మైనంపల్లి హనుమంతరావు, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డిలను సత్కరించారు.

బాలుడికి హెర్నియా ఆపరేషన్

సిద్దిపేట టౌన్, మార్చి10: పట్టణంలోని సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో శ్రీనివాస్ అనే రెండున్నరేళ్ల బాలుడికి వైద్యులు హెర్నియా ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిరాం, డాక్టర్ దీపక్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఇంత చిన్న వయసులో ఇటువంటి సమస్యలు రావడం చాలా అరుదని, అందులో చిన్న పిల్లలకు ఆపరేషన్ చేయడం కూడా చాలా కష్టతరమన్నారు. కడుపు నొప్పితో వచ్చిన బాలుడికి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ అవసరమని చెప్పారు. హాస్పిటల్ ఎండి ఇమ్రాన్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తుల పరిశీలన పూర్తి

మద్దూరు, మార్చి 10 : ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని తహసీల్దార్ అనంతరెడ్డి తెలిపారు. ఈ విషయమై ఆయన మాట్లాడారు. 82 పెండింగ్ దరఖాస్తులుండగా అందులో వివిధ కారణాల మూలంగా 24 దరఖాస్తులను రిజెక్ట్ చేశామని, 58 దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు.

చెరువుల్లోకి విడుదల కాని సాగునీరు


నీరు లేక ఎండిపోయిన కొండపాక, తిమ్మారెడ్డిపల్లి చెరువు

కొండపాక, మార్చి 10: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులకు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గతంలో సాగునీరు వచ్చేది. ప్రస్తుతం అక్కడి నుంచి నీరు విడుదల కాకపోవడంతో చెరువులన్నీ ఎండిపోతున్నాయి. దాంతో యాసంగి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కాలువల ద్వారా నీటిని తెప్పించేందుకు రైతులు, స్థానిక నాయకులు చర్యలు తీసుకున్నప్పటికీ, ఎన్నో అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలని మండల నాయకులు, రైతులు కోరడంతో, ప్రభుత్వం 2016 సంవత్సరంలో 42 కోట్ల రూపాయల వ్యయంతో కాలువలను నిర్మించి డి4 కెనాల్ ద్వారా పలు గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేసింది. నిండు వేసవిలో కూడా చెరువులు నిండుకుండలా ఉండేవి. రిజర్వాయర్‌లో ఉన్న నీటిని చేర్యాల, కొమరవెల్లి, ఐనాపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే కాలువల ద్వారా మాత్రమే నీటిని తరలిస్తున్నారు. కొండపాక మండలానికి వచ్చే డి 4 కెనాల్ ద్వారా నీటిని పంపించడం లేదు. పంటలన్నీ ఎండిపోతున్నాయి.

నీరు విడుదల చేసి ఆదుకోవాలి



తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా నీరు రావడం లేదు. వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. పెట్టుబడి కూడా మట్టిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

- గుజరాతి శ్రీనివాస్, పిట్టలవాడ దమ్మకపల్లి

కాలువ నిర్మాణంలో వసూళ్ల పర్వం

చేర్యాల, మార్చి 10: పట్టణంలో కొనసాగుతున్న జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టు సూపర్‌వైజర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపక్కన భవనాల యాజమానుల నుంచి వసూళ్లకు పాల్పడుతుండడం వివాదస్పదమవుతున్నది. నిబంధనల ప్రకారం రోడ్డుమధ్య నుంచి ఇరువైపులా 45ఫీట్ల దూరంలో డ్రైన్‌కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, కొద్దిమంది దుకాణ భవన యజమానులు ముందరిభాగంలో కొంతమేర స్థలాన్ని కోల్పోవాల్సి రావడంతో, అలా నష్టపోకుండా నిర్మాణం చేపట్టాలని ఆందోళనలు చేపట్టారు. ఈవిషయాన్ని ఆసరా చేసుకున్న సూపర్‌వైజర్ సదరు యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. అడిగినన్ని డబ్బులుఇస్తే త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తున్నాడు.

రూ.5 వేలకు బేరం, రూ.2వేలు ముందస్తు వసూలు

ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ సమీపంలో డ్రైన్‌కాలువ పనులు కొనసాగుతున్నాయి. ఓ దుకాణాదారుడు అడిగినన్ని డబ్బులు ఇవ్వడంతో 13.5మీటర్లకు కాలువ చేపట్టడంతో పాటు పునాదిరాళ్లను వారి సిబ్బందే పక్కన భద్ర పరిచారు. ఓ వ్యక్తి కేవలం నాలుగు ఇంచుల స్థలం విడిచిపెట్టి గోతి తీయాలని కోరినందుకు సూపర్‌వైజర్ రూ.5వేలు ఇవ్వాలనడంతో కాంప్లెక్స్ యాజమాని షాదుల్లా రూ.2వేలు ముందస్తుగా చెల్లించి, మిగతా రూ.3వేలు పని పూర్తిచేశాక ఇస్తానని చెప్పినా కూల్చివేతకు ప్రయత్నించడంతో పనులు అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

అసంపూర్తిగా క్రీడా ప్రాంగణాలు

మద్దూరు, మార్చి 10: యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకునేందుకు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అప్పటి ప్రభుత్వం ఒక్కో క్రీడాప్రాంగణానికి వాలీబాల్ కిట్స్, క్రికెట్ కిట్స్, డంబుల్స్, క్రీడా దుస్తులను సరఫరా చేసింది.


దూళిమిట్ట మండలం జాలపల్లిలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం (ఫైల్)

పనులవైపు తొంగిచూడని అధికారులు

హడావుడిగా పనుల్ని ప్రారంభించిన అధికారులు బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగడం లేదరు. క్రీడాప్రాంగణాల కోసం తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరును సూచించే బోర్డు, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ కిట్, ఎక్సర్ సైజ్ బార్ వంటి పరికరాలను లక్షలాది రూపాయలు ఖర్చు చేయించి ప్రజాప్రతినిధులచే కొనుగోలు చేయించారు. క్రీడా ప్రాంగణం చుట్టూరా పచ్చదనం ఉట్టిపడేలా చెట్ల పెంపకం చేపట్టాలన్న ఆదేశాలు ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఒక్కో గ్రామపంచాయతీ సుమారు రూ.45 వేల నుంచి 2 లక్షల చొప్పున సుమారు అన్ని గ్రామపంచాయతీలు కలిపి సుమారు రూ. 22 లక్షలపైనే ఖర్చు చేసినట్లు సమాచారం.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నకోడూరు, మార్చి10: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామ శివారులో శనివారం రాత్రి వారు పట్టుకున్నారు. వాహనం, 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని చిన్నకోడూరు పోలీసులకు అప్పగించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.


మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-1999లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా 25 సంవత్సరాల తర్వాత సిల్వర్ జూబ్లీని తాము చదువుకున్న పాఠశాలలో జరుపుకున్నారు. పాఠశాలలో కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు.గురువులను సన్మానించారు.

- దూళిమిట్ట

మహిళల సాధికారతే లక్ష్యం

నంగునూరు, మార్చి 10: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆదివారం నంగునూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పీఎఫ్ అధికారిని భూలోకేశ్వరి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు విజయ, డాక్టర్ మమత, రాష్ట్ర నాయకులు వసంత, కవిత, అనిత, సరిత, మహిళలు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రెడ్డికి జ్యోతిష్య శిరోమణి బిరుదు

సిద్దిపేట క్రైం, మార్చి 10 : సిద్దిపేట ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డి జ్యోతిష్య శిరోమణి బిరుదు దక్కించుకున్నాడు. రాష్ట్రంలో ఎస్ఎస్ లైఫ్ ఆస్ట్రో సంస్థ వారు జ్యోతిష్య శాస్త్రంలో ప్రముఖ సేవలు అందించిన వారికి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి బిరుదులు అందిస్తారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

బీజేపీ గజ్వేల్ పట్టణాధ్యక్షుడిగా మనోహర్‌యాదవ్

గజ్వేల్, మార్చి 10: బీజేపీ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ అధ్యక్షుడిగా ముట్రాజ్‌పల్లికి చెందిన దేవులపల్లి మనోహర్‌యాదవ్‌ను నియమిస్తూ, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఉత్తర్వులను వెలువరించారు.

● **మర్కూక్:** మర్కూక్ మండల బీజేపీ అధ్యక్షుడిగా సాయిరెడ్డి రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడి గంగాడి మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

● **కొండపాక:** బీజేపీ కొండపాక మండల అధ్యక్షుడిగా బందారం గ్రామానికి చెందిన నీల సత్యాన్ని నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు.

● **కుకునూరుపల్లి:** బీజేపీ కుకునూరుపల్లి మండల అధ్యక్షుడిగా చిన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన అనుముల సంపత్‌రెడ్డిని నియమించారు.

● **జగదేవ్‌పూర్:** బీజేపీ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడిగా చాట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి ఐలయ్యను నియమిస్తూ ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ప్రకటించారు.

● **నంగునూరు:** మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కోల సతీష్ గౌడ్, బండి రాజు, బెందాల రాజలింగం, ముడికే లక్ష్మణ్, నార్లపురం ఎల్లయ్య, కత్తుల పరమేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పప్పు సురేందర్ రెడ్డి, పిల్లి కర్ణాకర్, బండి సతీష్, కార్యదర్శులుగా కిషోర్, రమేష్, రవి, గుంటుపల్లి రాజశేఖర్, కోశాధికారిగా సయ్యద్ రమేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా షీలా దీపక్ గౌడ్, కిషన్ మోర్చా మండల అధ్యక్షుడిగా వేముల రత్నాకర్ రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షుడిగా ఈగ జ్యోతిరెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడిగా గట్టు రవీందర్, దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా బుజ్జిగా యాదగిరి, మండల స్పోక్ పర్సన్‌గా నిమ్మ అక్షితరెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా అరగొండ రాజు, కార్యవర్గ సభ్యులుగా యాదర్ల నరేష్ కుమార్, కోల పరశురాములు, గుడాల అజయ్, బొడిగె రమేష్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● **నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండల కేంద్రంలో బీజేపీ పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పోన్నాల బాబు అధ్యక్షతన ఆదివారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా గడ్డం శ్రీకాంత్ గౌడ్, బోయిని బాలు, ఉపాధ్యక్షులుగా కోడి కనకయ్య, గడ్డం స్వామినాథ్ గౌడ్, సోప్పరి బాబు, గోల్కొండ భాస్కార్‌రెడ్డి, ఓబీసీ మోర్చాబోయిని బాబు, మహిళ మోర్చా మండల అధక్షురాలిగా గోల్కొండ లతా రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడిగా అప్పనపల్లి కరుణాకర్ లను ఏకగ్రివంగా ఎన్నుకున్నారు.